కథ

# చివరకు మిగిలేది

''లాయర్ గారింట్లో వారం రోజులు వంట చేస్తే పధ్నాలుగు వందలు ఇస్తారన్నావ్! వెయ్యి రూపాయలే ఇచ్చావేమిటి? మిగతా నాలుగు వందలు ఏం చేసావ్?'' నిలదీస్తున్నట్టున్న కొడుకు చలపతి కఠిన స్వరానికి మంగమ్మ మనసు చివుక్కుమంది.

గత కొన్నేళ్ళుగా అతను తన ఆదాయ వ్యయాలని ప్రశ్నిస్తూనే వున్నా ఎప్పుడూ ఆ బాధ ఆమె మనసుని పిండేస్తూనే వుంటుంది.

''రెండు వందలు నా ఖర్చుల కోసం వుంచుకున్నానురా!''

''మిగతా రెండు వందలు?''

''ఏ కామయ్యకో, పుల్లయ్యకో దానం చేసి వుంటుంది. మీ అమ్మ దానకర్ణుడి చెల్లెలు కదా'' కోడలు శారద ఎగసన దోసింది.

''పాపం! కామయ్య గారమ్మాయి పురిటికి వచ్చిందిరా! ఆ అమ్మాయికి మందులు కొనడానికి డబ్బు లేదంటే ఇచ్చాను''

''దానం చేసేసావా? అసలు ఏమనుకుంటున్నావే నువ్వు! నువ్వో మదర్ థెరిసావనా? ఎంతమంది కష్టాలకి కరిగిపోయి దానం చేస్తే? ఇలా వందలకి వందలు దానం చేసుకుంటూ పోతుంటే మనకి చివరకి మిగిలేది చిప్పే!''

''కష్టాలలో వున్నవాళ్ళకి సాయం చేస్తే పుణ్యంరా! మనం ఈ లోకంలోకి వచ్చేటప్పుడు ఏమీ పట్టుకురాలేదు. ఈ లోకాన్ని వదిలి వెళ్ళేప్పుడు ఏమీ తీసుకెళ్ళం!'' నచ్చ చెబుతున్నట్టు అంది మంగమ్మ.

''నీ సూక్తి ముక్తావళి తరువాత విన్పిస్తువు గాని, ముందా రెండు వందలు ఇలాగియ్యి''

''నా బస్ ఛార్జీలకి డబ్బులు కావాలిరా!''

''నీకు బస్ ఛార్జీలకి డబ్బు నేను ఇస్తాను. ముందా డబ్బు ఇలాగియ్యి. నీ దగ్గర డబ్బుంటే నీ చేతులు తెగ దురద పెడతాయి. ఏ కాలమాసిన సన్నాసికో దానం చేస్తావు'' కటువుగా అన్నాడు చలపతి.

మంగమ్మ నిర్వేదంగా రొంటిన దోపుకున్న డబ్బు తీసి ఇచ్చింది.

చలపతి డబ్బు తీసుకుని మొత్తం మరోసారి లెక్కపెట్టుకుని తల్లివైపు ఒక కోర చూపు విసిరి వెళ్ళిపోయాడు.

''ఎవడో అడగ్గానే రెండు వందలు దానం చెయ్యగలదు గాని పండగ వస్తోంది చీర కొనుక్కోమని కోడలి చేతిలో ఆ డబ్బు పెడదామనే ఆలోచనే లేదు ముసలిదానికి. ఇంటికి జ్యేష్ఠ పారుక్కి శ్రీమహాలక్ష్మి'' శారద గొణుక్కుంటోంది. గొణుగుడేమిటి తనకి, స్పష్టంగా వినిపించాలనే కోడలు అంటున్న ఈ మాటలు ఆవిడ మనసుని తూట్లు పొడిచాయి.

''తను ఇంటికి జ్యేష్ఠా? ముప్పై సంవత్సరాల నుంచి ఈ ఇంటి కోసం కొడుకు కోసం ఎంత తాపత్రయపడింది? ఈ ఇల్లు ఇంట్లోని ప్రతి వస్తువు తన కష్టార్జితమే! వంటలు చేసి, నీళ్ళ బిందెలు మోసి సంపాదించినదంతా ఎప్పటికప్పుడు కొడుక్కి ఇస్తూ వచ్చింది. ఒక రకంగా తనే వాడికి డబ్బు ఇవ్వడం అలవాటు చేసింది. ఆ అలవాటు వాడిలోని ధనకాంక్షని డబ్బు కూడబెట్టడమనే వ్యసనంగా మార్చింది. అదే ఇవాళ తన సంపాదనపై తనకి హక్కు లేకుండా చేసింది.

మంగమ్మకి భర్త గుర్తుకొచ్చాడు.

ఏ పని చెయ్యకుండా జులాయిగా తిరిగే భర్త. పగలంతా తను కష్టపడి సంపాదించిన దాన్ని సాయంకాలం సారాయి దుకాణానికి సమర్పించే భర్త.

ఆనాడు భర్త వ్యసనానికి తన సంపాదన హరించుకుపోయేది.

ఈనాడు కొడుకులోని వ్యసనానికి తన సంపాదనపై తనకి హక్కు లేకుండా పోతోంది-

ఆవిడ భారంగా నిట్టూర్చింది.

''వంటయింది. భోజనం చెయ్యండి'' ఎలాంటి సంబోధన లేకుండా ఏ గోడకో, తలుపుకో చెప్పినట్టు చెప్పింది శారద.

''నాకు ఆకలి లేదమ్మా! మధ్యాహ్నం తిన్నదే అరగలేదు'' అంది మంగమ్మ.

''ఆ మాట నేను వంట చెయ్యబోయే ముందు చెప్పవచ్చుగా? మీకోసం వండిన అన్నం ఎవరు తింటారు?''

''అమ్మా! అన్నం తిని రెండు రోజులయింది. ఒక ముద్ద వుంటే పెట్టు తల్లీ!'' వీధిలో నుంచి బిచ్చగత్తె పిలుపు.

ఆకలి పేగుల ఆక్రందనే దాని స్వరంలో విన్పిస్తోంది.

మంగమ్మ కూర్చున్న చోట నుంచి లేచింది.

''పాపం! ఆ బిచ్చగత్తె అన్నం తిని రెండు రోజులయిందిట. నా కోసం వండిన అన్నం వృధా చెయ్యడమెందుకు? దానికి పెట్టు శారదా!''

''ఏమిటీ! బిచ్చగత్తెకి అన్నం పెట్టాలా? మీ సంపాదనతో కొన్న పొలాలు విరగపండుతున్నాయనుకున్నారా? కిలో బియ్యం పధ్నాలుగు రూపాయలు పెట్టి కొంటున్నారు మీ అబ్బాయి. రేపు ప్రొద్దుట ఆ చద్దన్నంతో పులిహోర కలుపుకుని మేమే తింటాం'' విరుచుకు పడింది శారద.

''అమ్మా!'' బిచ్చగత్తె దీనంగా పిలుస్తోంది.

మంగమ్మ తన పెట్టెలో నుంచి పది రూపాయలు తీసి ఆమె జోలిలో వేసింది.

''అన్నం మిగలలేదు. ఈ డబ్బుతో ఏమైనా కొనుక్కుని తిను'' ముడుతలు పడిన ఆ ముసలి ముఖంలో పది రూపాయలు ఒకేసారి చూసిన ఆనందం.

''చల్లగా వుండు తల్లీ'' దీవించి వెళ్ళిపోయిందామె.

వెనుదిరిగిన ఆవిడకి నిప్పులు చెరుగుతున్న కళ్ళతో తననే చూస్తున్న శారద కన్పించింది.

వేదనాభరితమైన నిట్టూర్పు ఆమె పెదవుల నుంచి వెలువడింది.

మంచి నీళ్ళు తాగి వచ్చి తన మంచం మీద పడుకుంది.

బయటికి వెళ్ళిన కొడుకు ఇంటికి తిరిగి రావడం, కోడలు అతనితో తను బిచ్చగత్తెకి పది రూపాయలు దానం చేసిన విషయాన్ని అదేదో పెద్ద నేరంలా చెప్పడం వింటూనే వుంది ఆవిడ.

''ముసలిదానికి డబ్బు విలువ తెలియడం లేదు'' అని కొడుకు అనడం విన్న ఆవిడ పెదవులపై విరిగిన పాల లాంటి నవ్వు కదలాడింది.

''మనుషులు ఇంత తేలికగా గతాన్ని ఎలా మరచిపోతారా?'' అని ఆశ్చర్యపడుతోందావిడ.

'ఒక పూట తిని, మరో పూట పస్తు వున్న ఆ రోజులని ఎలా మరచిపోగలిగాడు చలపతి? తన ఆకలి వంటిదే ఇతరుల ఆకలి కూడా అని ఎందుకు అర్థం చేసుకోడు వాడు? వారాలు చేసుకుని చదువుకుని, ఉద్యోగం సంపాదించుకున్న వాడు తన సంపాదనలో ఒక్క రూపాయి దానం చెయ్యడానికి విల విల లాడుతాడెందుకని? నడమంత్రపుసిరి వాడి కళ్ళు కప్పేస్తోందా? మితిమీరిన ధనకాంక్ష తల్లి సంపాదనని ప్రశ్నించే హక్కు తనకి లేదనే విచక్షణా జ్ఞానాన్ని నశింపచేస్తోందా?' ఆవిడ మనసు చేదు తిన్నట్టుగా వుంది.

★★★

''నేను పనికి వెళ్ళాలిరా చలపతీ! బస్ ఛార్జీలకి డబ్బులిస్తావా?'' మంగమ్మ అడగగా అతను జేబులో నుంచి అయిదు రూపాయల కాగితాన్ని తీసి ఆవిడపైకి విసిరాడు. అది వెళ్ళి ఆవిడ పాదాల దగ్గర పడింది.

అతని చర్యలోని నిరసన, తృణీకార భావానికి మంగమ్మ మనస్సు చివుక్కుమంది. ఆవిడ తన బాధని, దుఃఖాన్ని ముఖంలో ప్రతిఫలించనివ్వకుండా విశ్వప్రయత్నం చేస్తూ వంగి ఆ డబ్బు తీసుకుని బయటకి వచ్చింది. నీళ్ళు నిండిన ఆవిడ కళ్ళకి పరిసరాలు అలుక్కుపోయినట్టు కన్పిస్తున్నాయి.

'ఎందుకింత కఠినంగా మారిపోతున్నాడు చలపతి? తనేమీ డబ్బుని దుబారా చెయ్యడం లేదే! సాటి మనిషి కష్టానికి స్పందించి సహాయపడడం తన తప్పా? తన కష్టార్జితంలో పది రూపాయలు దానం చేసుకునే హక్కు తనకి లేదా?' బస్సు రావడంతో ఆలోచనలలో నుంచి తేరుకుని బస్ ఎక్కింది.

''అలా వున్నారేం మంగమ్మగారూ! ఒంట్లో బాగాలేదా?'' ఆప్యాయంగా అడిగిన ఆ ఇంటి యజమానురాలి ప్రశ్నకి కూర తరుగుతున్న ఆవిడ ఉలిక్కిపడింది.

'తన ముఖంలోని మార్పుని ఆవిడ పసిగట్టిందా?'


''కొంచెం ఒంట్లో బాగాలేదు. వయసు వస్తోంది కదూ? ఆరోగ్యంగా ఎలా వుంటాను?'' అని నవ్వేసింది.

ఆవిడ కోడలు చిత్ర ఆ పూట పనిమనిషి రాలేదని తిట్టుకుంటూ గిన్నెలు తోమబోతుంటే ''అలా వుంచండమ్మా! నేను తోమి పెడతాను'' అంది.

మంగమ్మ అలా అనగానే పని తప్పిందే చాలనుకుని ఆమె లోపలకి వెళ్ళిపోయింది. ఆవిడ ఒక పక్క వంట చేస్తూనే గిన్నెలు తోమి గదులన్నీ వూడ్చింది.

''పాపం! మంగమ్మ గారు! కుడి ఎడమల తేడా లేకుండా పని చేస్తుంది. ఇవాళ ఆవిడకి మరో యాభై రూపాయలు ఎక్కువియ్యి' చిత్ర అత్తగారు అన్నదానికి పైకి 'అలాగే' అంది.

''ఉత్తి గిన్నెలు తోమినందుకు యాభై రూపాయలు ఇవ్వాలా? తనేమైన ఆవిడని గిన్నెలు తోమమని అడిగిందా? ఆవిడ నలుగురు మనుషులకి వంట వండి ఏం కష్టపడిపోతోందని రోజుకి వంద రూపాయలు పుచ్చుకుంటోంది? అయిదు రూపాయలు కూడా ఎక్స్‌ట్రా ఇవ్వక్కర్లేదు'' అనుకుంది లోలోపల.



పైకి ఎంత మామూలుగా వుందామని ప్రయత్నించినా మంగమ్మకి కన్నీళ్ళొస్తూనే వున్నాయి.

అయిదు రూపాయలని బిచ్చం విసిరినట్టు విసిరిన కొడుకు గుర్తొస్తే ఆవిడ మనసు బాధా వేదనలతో నలిబిలి అవుతోంది.

''ఏం జరిగింది? మీ కోడలేమయినా అందా?'' చిత్ర ప్రశ్నతో వంట పూర్తి చేసి పెరటి మెట్లమీద కూర్చున్న మంగమ్మ ఉలిక్కిపడింది.

''ఏం లేదమ్మా!'' కంగారుపడిపోయింది.

''మరి ఆ కన్నీళ్ళెందుకు?'' ఆప్యాయత కంటే కుతూహలమే ఎక్కువగా ధ్వనించింది చిత్ర స్వరంలో.

''కోడలు ఏమైనా అన్నా ఇంత బాధపడేదాన్ని కాదమ్మా! నా కొడుకే నాకు పరాయివాడయ్యాడు'' అంటూ కన్నీళ్ళతో జరిగినదంతా చెప్పింది.

''మీకంటూ ఏమీ మిగుల్చుకోకుండా డబ్బు దానం చేస్తున్నారని అతను అలా అని వుంటాడు. తనకి మాలిన ధర్మం చెయ్యకూడదు. మీ తాహతుకి రెండు వందలు దానం చెయ్యడమంటే మాటలా?''

''ఏం పట్టుకెళ్తామండీ చిత్రమ్మగారూ! ఈ లోకంలోకి వచ్చేటప్పుడు మనతో ఏం తెచ్చాం? పోయేటప్పుడు ఏం పట్టికెళ్తాం?''

''అలా అనుకుంటే ఈ తాపత్రయం ఎందుకు? రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదించడం ఎందుకు?'' అంది చిత్ర నవ్వి.

మరి కాస్సేపటి తరువాత ఆ ఇంటి పనిమనిషి ఆదెమ్మ వచ్చింది. ఆమెని చూడగానే చిత్ర భద్రకాళి అవతారం ఎత్తింది.

''ఏం, మహారాణిగారు ప్రొద్దుట పనిలోకి రాలేదేం?''

''బిడ్డకి నిన్న సందేళ నుంచి జొరం. ఆస్పత్రికి తీసుకెళ్ళి సూదిమందు వేయించి తెచ్చినా''

''నువ్వు వస్తావని మధ్యాహ్నం దాకా ఎదురు చూసి నువ్వు రాకపోయేసరికి మంగమ్మగారు గిన్నెలన్నీ తోమారు. చేసిన నిర్వాకం చాలు గాని, వెళ్ళి గదులన్నీ శుభ్రంగా తుడిచి తడి బట్ట పెట్టు''

హోతా పద్మినీదేవి

''అలాగేనమ్మగారూ!'' అని వినయంగా చెప్పి తన పనిలో నిమగ్నమయింది.

ఆదెమ్మ పని పూర్తయినా, మిల్లుకి వెళ్ళి బియ్యంపిండి ఆడించుకు రమ్మని, మొక్కలకి నీళ్ళు పొయ్యమని బట్టలు ఇస్త్రీ చేయించుకు రమ్మని అదని, ఇదనీ ఏవేవో పనులు పురమాయిస్తూనే వుంది చిత్ర.

''అమ్మగారూ! నా బిడ్డ జొరంతో మూసిన కన్ను తెరవడం లేదు. మందులు కొని వెళ్ళాలి. ఇంక ఇంటికి వెళ్తానమ్మగారూ!'' చేతులు నలుపుకుంటూ ప్రాధేయపడింది.

''వెళ్దువుగానిలే! ఆ సన్నజాజి పూలు కోసి పెట్టు!''

అది నిస్సహాయంగా చూసి పూలుకోయడం మొదలుపెట్టింది.

**అజయ్ అంత మొనగాడా?**

అవున్మరి. అత్యధిక రెమ్యునరేషన్ తీసుకునేది అజయ్ దేవ్‌గన్. లేటెస్ట్ సంగతులెన్నో చెప్తున్నాడతను. ఓ లుక్కేద్దాం రండి.

★ 'లజ్జా'లో నా రోల్ చాలా పవర్‌ఫుల్. ఇంతకు ముందెప్పుడూ అలాంటి పాత్ర చేయలేదు. ఆ క్యారెక్టర్, స్టయిల్, లాంగ్వేజ్ మేనేజ్ చేయడం చాలా కష్టమయింది.

★ త్వరలో ఓ కొత్త సినిమా తీస్తున్నాను. నా ఫెయిల్యూర్‌ని కూడా సక్సెస్‌గా మార్చుకునే కెపాసిటీ నాకుంది.

★ నా ఫ్యామిలీలోనే నన్ను హర్ట్ చేసే వాళ్ళున్నారు.

★ నేను చాలా ఎమోషనల్‌గా ఉంటాను.

★ కుటుంబంలోని వ్యక్తులు నాతో సహకరిస్తే, నేను దేన్నయినా భరించగలను.

-చిత్రలేఖ

''మంగమ్మగారూ! వంటంతా అయిందే కదూ? అప్పడాలు వేయించారా? పెరుగు పచ్చడిలో కొత్తిమీర వేసారా?''

''వేసానమ్మా! అన్నీ బల్లమీద పెట్టా... నేను వెళ్ళొస్తాను''

''మంచిది ప్రొద్దుట పెందరాళే రండి.''

''ఒక వంద రూపాయలిస్తారా?''

''రేపు పనిలోకి వస్తారా?'' ఆమె స్వరంలో అనుమానం.

''ఎందుకు రానమ్మా! చేతిలో బొత్తిగా డబ్బులు లేవు. అందుకని'' చిత్ర లోపలికి వెళ్ళి డబ్బు తెచ్చి ఇచ్చింది.

''ఇంక నువ్వు వెళ్ళు'' తనకి పూలగిన్నె అందిస్తున్న ఆదెమ్మతో దయతలుస్తున్నట్లు అంది.

''అమ్మగారూ!''

చిత్ర నొసలు చిట్లించింది. ''ఏం, ఏం కావాలి?''

''యాభై రూపాయలుంటే ఇవ్వండమ్మా! నెల జీతంలో తీసుకుందురుగాని, బిడ్డకి మందులు కొనాలి!''

''ఇవ్వను, ప్రతి నెల నీకు ఇదొక అలవాటయి పోయింది. ఏదో ఒక కారణం చెప్పి డబ్బు ఎడ్వాన్స్‌గా తీసుకోడం.''

''అనా అనకండమ్మా! బిడ్డకి ప్రాణం బాగా లేదు'' ఆదెమ్మ బ్రతిమాలేకొద్దీ చిత్ర బిగుసుకు పోయింది. ససేమిరా ఇవ్వనంది. నచ్చకపోతే పని మానెయ్యమని నిష్కర్షగా చెప్పి లోపలికి వెళ్ళిపోయింది.

లక్షాధికారియైన చిత్రకి యాభై రూపాయలు ఒక లెక్క కాదు. నిజానికి ఆమె పేదరాలైన ఆదెమ్మకి ఉచితంగా ఆ డబ్బు ఇవ్వవచ్చు. కాని, అప్పుగా కూడా ఇవ్వనంటున్న ఆమెని చూస్తూ ''తన కొడుకు లాంటి వాళ్ళు చాలామంది వున్నారీ లోకంలో'' అనుకుంది మంగమ్మ.

నిస్సహాయంగా కన్నీళ్ళతో నిలబడి పోయిన ఆదెమ్మని చూస్తే ఆవిడ మనసు ద్రవించి పోయింది. చిత్ర అంతకు ముందు తనకిచ్చిన వంద రూపాయలలో నుంచి యాభై రూపాయలు తీసి ఇంట్లోకి చూసింది.



'చిత్ర ఆదెమ్మకి డబ్బు ఇవ్వనన్నాక తను ఇస్తే, ఆమె మర్యాద పోతుంది!'

చిత్ర కనిపించలేదు.

ఆదెమ్మని చేతి సైగతో పిలిచింది.

''ఇదుగో ఈ డబ్బు తీసుకుని నీ బిడ్డకి మందులు కొను. నేను ఈ డబ్బు అప్పుగా ఇవ్వడం లేదు. నువ్వు నాకు తిరిగి ఇవ్వక్కర్లేదు'' అంది రహస్యంగా.

ఆ క్షణంలో ఆదెమ్మ కళ్ళలో కనిపించిన కృతజ్ఞతని వర్ణించడానికి మాటలు చాలవు.

★★★

చలపతి ఉద్యోగంలో చేరిన కొత్తల్లో తన తల్లి జీతానికి పని చేసే వంట మనిషి అని తన తోటి ఉద్యోగులకి తెలుస్తుందని చిన్నతనంగా నామోషీగా వుండేది. తల్లిని వంటలు వండడం మానెయ్యమని చెప్పాలనుకున్నాడు కూడా. కాని, తను నెలంతా కష్టపడితే వచ్చే డబ్బు తన తల్లి పది రోజులలో సంపాదిస్తుందనే నిజం, అతన్ని ఆ పని చెయ్యనివ్వలేదు.

అలాంటి చలపతి దృష్టిలో తల్లి చేసే దానం దుబారా. అతను ఆవిడ చేత ఆ దుబారాని మాన్పించడానికి డబ్బులేకపోతే తర్వాత ఏర్పడే పరిణామాలని చెప్పి ఆవిడని భయపెట్టదలచుకున్నాడు.

''నువ్వు ఇవాళ ఓపికగానే వున్నావు కాబట్టి పని చేసి డబ్బు సంపాదించగలుగుతున్నావు. రేపు నీ ఒంట్లో ఓపిక తగ్గిపోతే పని చెయ్యలేవు. ఈరోజులలో ఏ రోగమొచ్చినా డాక్టరు దగ్గరికి వెళ్తే వందలు కాదు, వేలు కావాలి. నేనూ నెల జీతగాడినే! నీ వైద్యం కోసం నేనెక్కడ నుంచి వేలకి వేలు తేగలను? అందుకని నువ్వు డబ్బు దాచుకో! ఇప్పుడైనా జాగ్రత్త పడు''

మంగమ్మ కొడుకు చెప్పినది వింది. సమాధానం ఇవ్వలేదు. ఆవిడ మౌనంతో శారద రెచ్చిపోయింది.

''ఆవిడకి రోగం వచ్చి మంచం ఎక్కితే వైద్యం చేయించకపోతే నలుగురూ మన ముఖాన ఉమ్మెయ్యరూ? మనం అప్పుల పాలయినా ఫర్వాలేదు. ఆవిడకి కావలసింది లోకంలో కీర్తి!''

మంగమ్మ నిర్లిప్తంగా ఆమె వైపు చూసి లోపలికి వెళ్ళిపోయింది.

చలపతికి తల్లి మౌనం అనేక అర్థాలను చెప్పింది. అతను పళ్ళు నూరుకున్నాడు.

వారం రోజుల తరువాత...

ఆరోజు...

పూజ చేసుకుంటున్న మంగమ్మ వున్నట్టుండి పక్కకి ఒరిగిపోయింది. ఏదో పని మీద అటుగా వచ్చిన శారద అత్తగారిని చూసి

గభరాపడి భర్తని పిలిచింది.

తల్లిని అలా చూస్తుంటే చలపతికీ గ రాగా అనిపించింది. అతను ఆవిడని కుద డు. 'అమ్మా!'

మంగమ్మలో చలనం లేదు.

అతను డాక్టర్ని పిలుచుకు రమ్మని ర్యని పంపాడు.

డాక్టరు వచ్చి ఆవిడని పరీక్షించి అన్నా .

''ఆవిడ ప్రాణం పోయింది. మాసి హార్ట్ ఎటాక్ వలన కావచ్చు. ఇది వరకెప్పుడైనా ండె నెప్పి వస్తోందనే వారా?''

''తెలియదు'' అనబోయి ''లేదు'' చె డు చలపతి.

డాక్టరు వెళ్ళిపోయాడు.

శారద వెళ్ళి ఇరుగుపొరుగు వాళ్ళని పిల కు వచ్చింది.

నలుగురు మనుషులు సాయం పట్టి మంగమ్మ మృత దేహాన్ని హాలులో పడుకోబె ట్టారు.

''పాపం! నిన్న కూడా ఎవరింట్లోనో వంట చేసి వచ్చింది''

''ఎప్పుడూ చిర్రున చీది ఎరుగది. అలాం టిది ఎంతసేపటిలో మృత్యువు ముంచుకొ చ్చింది.''

''చేతికి ఎముక లేని ధర్మాత్మురాలు! మా అమ్మాయికి మందులు కొనడానికి డబ్బులు లేవంటే రెండు వందలు ఇచ్చింది!'' కామయ్య కన్నీళ్ళతో చెబుతుంటే అక్కడికి ఆయనేదో తన తల్లి నెత్తి పగలగొట్టి ఆవిడ దగ్గర నుంచి డబ్బులు లాక్కున్నాడన్నంత గుర్రుగా చూసాడు చలపతి.

## మీనా తెలివి

బాలీవుడ్ భామలు బాలీవుడ్ భామలే! ఏదో ఇలా వచ్చి, అలా వెళ్లిపోయే టైప్ వాళ్లు. మేమే చిరస్థాయిగా ప్రజల గుండెల్లో వుండేది. అందుకనే కదా 'శ్రీ మంజునాథ'లో నన్ను పార్వతిగా తీసుకుంది. వాళ్లే అందగత్తెలయితే వాళ్లనే తీసుకునేవారు. సిమ్రాన్, అంజలా జవేరి, ప్రీతీ జింతాలు అలాంటి క్యారెక్టర్స్ చెయ్యలేరుగా. మేమయితే అటు దేవతల పాత్రలు, ఇటు హీరోయిన్సుగానూ, గ్లామర్ రోల్స్‌లోనూ ఎలా కావాలంటే అలా నటిస్తాం! వాళ్లకా దమ్మేది... అంటూ తెగ లెక్చర్ దంచిందిట మీనా, ఓ సీనియర్ నటుడి ముందు. మీనా తెలివికి ఆశ్చర్యపోయాడట అతను. అవున్మరి! మీనానా, మజాకా!

-విరజ



''జరగవలసిన కార్యక్రమం చూడండి'' ఒకాయన అన్నాడు.

ఇంట్లో డబ్బేమీ లేదు.

ఎలా?

ఎప్పటికప్పుడు తల్లి దగ్గర గుంజిన డబ్బుని బ్యాంక్‌లో డిపాజిట్ చేసే చలపతి అను కున్నాడు.

హఠాత్తుగా ఏదో స్ఫురించి లోపలికి వెళ్ళి తల్లి పెట్టె తెరిచాడు.

చీరల అడుగున చిల్లర పైసలు తప్ప ఏమీ కన్పించలేదు.

''మీ అమ్మ దాచిన వజ్రాల మూట కోసం వెతు కుతున్నారా?'' ఎప్పుడు వచ్చిందో తెలియదుగానీ శారద కుతూహలంగా పెట్టెలోకి తొంగి చూసి వ్యంగ్యంగా అడిగింది.

''వజ్రాలా? వంద రూపాయలు కూడా లేవు'' అతను పెదవి విరిచాడు.

''ఎలా వుంటాయి? మీ అమ్మ కుడి చేత్తో సంపాదించిన దాన్ని ఎడమ చేత్తో దానం చేసే దాన కర్ణురాలయ్యే!''

''ఇవాళ ఆదివారం. బ్యాంక్‌కి సెలవు. ఏం చెయ్యాలి?'' అతనికి తనకంటూ ఏమీ మిగు ల్చుకోని తల్లిపై పట్టరాని ఆగ్రహంగా వుంది.

బయటికి వచ్చిన చలపతి తల్లి మృతదేహం చుట్టూ గుమికూడిన జనసందోహాన్ని చూసి నిట్రాటలా బిగుసుకుపోయాడు.

''మంగమ్మత్తా!'' అని కొందరు ''మంగమ్మ పిన్నీ!'' అని మరికొందరు ఏడుస్తున్నారు.

''చల్లని తల్లి! నా బిడ్డకి మందులు కొనడానికి డబ్బులు లేవంటే యాభై రూపాయలు ఇచ్చింది'' అని ఆదెమ్మ ఏడుపు.

''నా కూతురు పెళ్ళికి మంగళ సూత్రం చేయించి ఇచ్చింది'' అని కిళ్ళీకొట్టు వీరాస్వామి బావురుమన్నాడు.

అక్కడంతా జనం!

అశేష జన ప్రవాహం!

శోక సముద్రంలో మునిగిపోయి వున్నారంతా. తమ ఆకలి తీర్చిన, తమ అవసరాలు తీర్చిన, తమని కష్టాలలో ఆదుకున్న మంగమ్మ మరణానికి కుమిలి కుమిలి ఏడుస్తున్నారు.

''మనం ఈ లోకంలోకి వచ్చేటప్పుడు ఏమీ తీసుకురాలేదు. ఈ లోకాన్ని వదిలి వెళ్ళేటప్పుడూ ఏమీ తీసుకెళ్ళం!'' తల్లి తరచుగా అనే మాటలు గుర్తొచ్చాయి అతనికి.

తన తల్లిపై ఇంతమంది మనుషుల గుండెల్లో గూడుకట్టుకున్న అభిమానం ఇంతమంది కన్నీళ్ళు చూసాక ఇన్నేళ్ళూ తను తల్లిని డబ్బు కోసం ఎంత పీడించాడో తలచుకుని తన అల్పత్వానికి అతనికి తన మీద తనకే అసహ్యం వేసింది.

అప్పుడొచ్చింది అతనికి దుఃఖం.

హృదయాంతరాళాలలో నుంచి మనసుని ఆవరించుకున్న మాయపొరలని ఛేదించుకుని కన్నీళ్ళొచ్చాయి.

'అమ్మా!' తల్లి మృతదేహంపై పడి బావురుమన్నాడు చలపతి. ✪